అనంతరామయ్య మనసు ఎక్కడో ఉంది. దృష్టి మాత్రం రోడ్డు మీద ఉంది. ఆయన మాటి మాటికీ గోడ గడియారం వైపు చూస్తున్నారు. ఏ కాస్త అలికిడైనా ఆశగా గుమ్మం లోకి చూస్తున్నారు. 'తన కంగారే కాని, టైమ్ కాకుండా అతను మాత్రం ఎలా వస్తాడు?' అని తన కంగారుకి నవ్వుకుంటూ సమాధాన పడుతున్నారు. ఆయన ఇప్పుడు అంత ఆత్రంగా ఎదురు చూసేది ఆ వీథిలో ఉత్తరాలను బట్వాడా చేసే వీరయ్య కోసం. అతను సరిగా పన్నెండు గంటలకు ఆ వీథిలోకి వచ్చి ఉత్తరాలను పంచి పెడుతుంటాడు. ఇప్పుడు టైమ్ సరిగా పదకొండుకూడా కాలేదు. అంటే, వీరయ్య రావడాని కింకా గంట టైమ్ ఉందన్నమాట. అబ్బ! ఆ గంట ఇంకెంత సేపటికి పూర్తి అవుతుందో? పోనీ ఆ వీరయ్య తన కోసమన్నా ఓ గంటముందు రాకూడదూ? ప్చ్! తన కున్న కంగారు, ఆత్రత ఆ వీరయ్యకి ఎందు కుంటాయి? అతను డ్యూటీ చేసుకునే మనిషి. ఈ రోజు కాస్త ముందు వెళ్ళి పని ముగించుకు వస్తే మరి కాసిని ఎక్కువ డబ్బులు వస్తాయి కదా అనే ఆశ అతనికి ఎందు కుంటుంది? డ్యూటీ ప్రకారం తన పని క్రమంగా నిర్వర్తించుకుని వెళ్ళిపోతాడు.

అనంతరామయ్యకు టైమ్ గడవడం చాలా దుర్భరంగా ఉంది. ఈ గంట కాలక్షేపం కోసం ఎవరన్నా రాకూడదూ తన దగ్గిరికి? తన పిచ్చి కాని వాళ్ళ పనులు వదిలేసి ఎవరు మాత్రం వస్తారు? "నీకేమయ్యా—మగ పిల్లల తండ్రివి. ఆడపిల్లల పెళ్ళిళ్ళు చేయాలనే బాధా, సారె చీరెలు పెట్టి పంపించాలనే దిగులా, పండుగలు, పబ్బాలు, పురుళ్ళు పుణ్యాలు అంటూ వేడుక ఖర్చులా—ఏం ఉన్నాయి నీకు? హాయిగా ఉన్న ముగ్గురూ మగ పిల్లలే! అంతా ఆదాయమే కాని, వ్యయం లేదు కదా!" అని ఆడపిల్లల తండ్రి 'పిల్లల కోడి' అని బిరుదు పొందిన సుబ్బరామయ్య తనని, తన అదృష్టాన్ని చూసి ఈర్ష్యపడని క్షణం కాని, వాపోవని క్షణం కాని లేవు కదా! పాపం, అతగాని కందరూ ఆడపిల్ల లేను. ఒక్కో పిల్లకు పెళ్ళి చేయడం, రెండెకరాలు తెగనమ్మడం, మళ్ళీ ఆడపిల్లల పురుళ్ళ ఖర్చులు— అల్లుడుగారి అలకపాన్పుల ఖర్చులు, ఇలా ఎడతెరిపి లేని ఖర్చులతో అతని ఆస్తి అంతా హారతి కర్పూరంలా హరించి పోయింది కదా. ఆఖరి పిల్ల పెళ్ళికూడా ఉన్నంతలోనే ఘనంగా చేశాడు. కాని, ఏం లాభం? పెళ్ళికి ఇస్తానన్న కట్నం వడ్డీతో సహా ఇస్తేనే కాని కోడల్ని తీసుకు వెళ్ళమంటూ కూర్చున్నారు అత్త వారు. పెళ్ళి చేసిన అప్పే తీరుస్తాడా? అల్లుడి కట్నం బాకీయే తీరుస్తాడా? 'ఇదిగో ఇస్తా, అదిగో ఇస్తా' అంటూ కాలక్షేపం చేస్తున్నాడు, పాపం! అప్పుడే రెండేళ్ళు పూర్తి అయాయి, ఆ సాకుతో. ఆఖరి పిల్ల అత్తవారింటికి వెళ్ళలేదు సరికదా, ఓబిడ్డ తల్లి అయింది, కూతురికి తోడు మనవడు, అల్లుడు వెరసి ముగ్గురు ప్రాణా లయారు అతని రక్తం పీల్చడానికి.

'నాన్నా, నన్ను పంపించవా నా ఇంటికి?' అన్నట్లు బేలగా చూస్తుంది కూతురు. 'మరి మాడబ్బు మాటేమిటి' అన్నట్లు చూస్తాడు అల్లుడు. 'నన్ను చూసి అన్ని దిగుళ్ళు మరిచిపో, తాతా!' అన్నట్లు బోసి నవ్వులు కురిపిస్తాడు మనవడు. వాడితో కలిసి నవ్వలేక, కూతురితో కలిసి ఏడవలేక, మనసులో ఏడుస్తూ, పైకి నవ్వుతూ తిరగడం అలవాటు చేసుకున్న సుబ్బరామయ్య మగ పిల్లల తండ్రులను చూసి అసూయ పడటంలో అతిశయోక్తి లేదు.

'ప్చ్! సుబ్బరామయ్యా, నువ్వు నిజం గానే దురదృష్టవంతుడివోయ్— నన్ను చూడు, నాకు ఉన్న ముగ్గురూ మగపిల్ల లేను. తమ వెళ్ళాలే కాని, ముగ్గురూ తనని నెత్తి మీద పెట్టుకుని పూజిం చరూ?' పైకి వ్యక్తం చేయకపోయినా, లోలోపల తన అదృష్టానికి గర్వంతో పొంగిపోతూ ఉంటాడు అనంతరామయ్య. సుబ్బరామయ్య అన్నట్లు ఆయనకు ముగ్గురూ మగ పిల్లలేను. ముగ్గుర్నీ ప్రాణం కన్న మిన్నగా చూసుకున్నారు. మూడో కొడుకు నెలల పిల్లాడుగా ఉండగా భార్య ధనుర్వాతంతో కన్ను మూసింది. అప్పటినుంచి తల్లి, తండ్రి తనే అయి వాళ్ళని పెంచుకు వచ్చాడు. మళ్ళీ పెళ్ళి చేసుకోమని చాలా మంది ప్రోత్సహించారు కాని, రెండో పెళ్ళి చేసుకుంటే ఆ మనిషి తన పిల్లల్ని సరిగ్గా చూస్తుందో, చూడదో అనే భయంతో మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు.

ఆస్తి అంతా దుర్వ్యసనాల పాలు చేసి, తన కంటూ ఏమీ మిగుల్చుకో కుండా కన్ను మూశాడు తండ్రి. కాని, తన పిల్లలకుమాత్రం అలా జరక్కూడ దని ప్రతి క్షణమూ ఎంతో విలవగా ఎంచి, తన పిల్లలకు మాత్రం ఏ లోటూ రాకూడదని, వాళ్ళ భవిష్యత్తు ఉన్నతంగా ఉండాలని ఎంతో శ్రమించాడు. మరెంతో కూడబెట్టాడు. అదంతా పిల్లల భవిష్యత్తు కోసమే వెచ్చించాడు. అతను కోరుకున్నట్లే పిల్లలు ముగ్గురూ ప్రయోజకు లయారు. పెద్ద కొడుకు బాంకిలో మంచి ఉద్యోగం లోనే కుదురు కున్నాడు. రెండో కొడుకు రైల్వే ఉద్యోగి. కులాంతర వివాహం చేసుకుని ఎక్కడో హుబ్లీలో ఉంటున్నాడు. "ఎదిగిన కొడుకులు మీరు. మీకు చెప్పగలవాణ్ణి కాదు. మీ మనసుకి నచ్చింది, మంచిది అనుకునే పని చేయండి! చాలు! తండ్రిగా నా కా గర్వం మిగల్చండి" అన్నాడంతే. మూడో కొడుకుని డాక్టరు చేయా లనుకున్నాడు. తన దగ్గిరే అట్టే పెట్టు కోవాలని, కొడుకు నీడలోనే తనువు వెళ్ళిపోవాలని అనుకున్నాడు. కాని, ఆ కొడుకు డాక్టరు కాలేదు. ఏక్టరయాడు. నాటకాలు, సినిమాలు అంటూ ఎక్కడెక్కడో తిరుగుతుంటాడు. ఎప్పుడో కాని వచ్చి ముఖం చూపించడు. "నీ పెళ్ళికూడా అయిపోతే నాకు నిశ్చింతరా, నాయనా" అంటాడు అనంతరామయ్య. "అప్పుడేనా? ఇంకా జీవితంలో స్థిరపడ లేదు నాన్నా. స్థిరపడ్డాక, అలాగే చేసు కుంటాలే పెళ్ళి" అని నవ్వేసి వెళ్ళి పోతూంటాడు.

అసలు పెద్ద కొడుకునే తన దగ్గిర అట్టే పెట్టుకోవాలనే తెలిసిన వాళ్ళ ద్వారా ప్రయత్నించి, ఆ కొడుక్కి బాంకిలో ఉద్యోగం వచ్చేలా చేశాడు. ఇంట్లో ఆడ దిక్కంటూ లేదు. కోడలు వస్తే ఆ లోటు తీరి పోతుందని పేదింటి పిల్లనే కోడలుగా తెచ్చుకున్నాడు . "ఆ అమ్మాయి నాకు నచ్చలేదు. నేను చేసు కోను, నాన్నా!" అని పేచీ పెట్టిన కొడుకు పెళ్ళయిన క్షణం నుంచే భార్యా దాసుడై పోయి, భార్య గీచిన గీటు దాటనంత అప్రయోజకుడై పోవ డం చూసి, 'వాడిది మరీ మెతక మనసు' అని లోలోపల చిరాకు పడ్డారు. ఏ కొడుకు తన ఎదురుగా ఉంటాడని కలలు కన్నారో ఆ కొడుకు కావాలని తన నుండి దూరంగా వెళ్ళిపోయి నప్పుడు నిర్వికారంగా నవ్వుకున్నారు. 'వాడికీ ఓ గూడు ఏర్పడింది కదా మరి' అనుకుంటూ.

ఎక్కడో దూరంగా ఉన్న రెండో కొడుకు ఎప్పుడూ రాడు. బుద్ధి పుడితే క్షేమవార్తలు తెలియజేస్తాడు— అంతే.

ఈ రోజు ఆయన అంత ఆత్రతగా పోస్టుమన్ కోసం ఎదురు చూడటంలో కారణం లేకపోలేదు.

ఆ ఊరునుంచి ఓ టూరిస్టు బస్సు దక్షిణ దేశ యాత్రకు బయలుదేర బోతున్నది. యాత్రికులు చాలా మంది బాధ్యతల నుంచి దూరంగా తప్పుకున్న వారే. కొందరు కుటుంబాలతో బయలు



భారత ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ 'వ్యాసాలు, ప్రసంగాలు' గ్రంథాన్ని, రాయల్టీని ప్రచురణకర్తలు ఎమ్. శేషాచలం కంపెనీ పక్షాన శ్రీ ఎమ్. వి. సుబ్బారావు ప్రధానికి ఢిల్లీలో అందించినప్పటి చిత్రం. చిత్రంలో శ్రీ ఇలపావులూరి పాండురంగరావుగారు కూడా ఉన్నారు

దేరుతూంటే, మరి కొందరు ఒంటరిగా బయలుదేరుతున్నారు. అనంతరామయ్య స్నేహితుడుకూడా ఆ యాత్రికులలో ఒకడు ఆయన వచ్చి తను దక్షిణ దేశ యాత్రకు వెళ్ళబోతున్నట్లుగా చెప్పాడు అనంతరామయ్య దగ్గిర. తను అలా యాత్రకు బయలుదేరడానికి కారణం తన కొడుకూ కోడలే నని చెప్పడం మరిచిపోలేదు "ఇన్నాళ్ళూ నా కోసం ఎంతో శ్రమించవు. ఇక నువ్వు విశ్రాంతిగా పుణ్యక్షేత్రాలు దర్శించు కుంటూ చీకూ చింతా లేకుండా సంతోషంగా 'కృష్ణా,రామా' అంటూ నిశ్చింతగా ఉండు నాన్నా" అని తండ్రిని ప్రయాణం చేయిస్తున్నాడట, ఆ కొడుకు. "నా కైతే ఇష్టం లేదోయ్— యాత్రలంటే మాటలా? బోలెడంత డబ్బు కావాలి. ఒక్క రెక్క మీద కష్టం. ఇన్నాళ్ళూ గడవలేదా, ఇప్పుడూ అలాగే ఇంట్లో కూర్చుంటే రోజులు వెళ్ళమారిపోవా?' అని నా ఉద్దేశ్యం. కాని, మా కావుడు వినడంలేదే. 'డబ్బు ఇబ్బందులు ఎప్పుడూ ఉంటాయి మనిషికి. ఉన్నంతలోనే వెసులుబాటు చేసుకోవాలి మరి' అని వాడి పట్టుదల. అందుకే ఈ ప్రయాణం. నువ్వుకూడా వస్తే ఇద్దరమూ—సరదాగా ఊళ్ళు చూసి వద్దాము, ఏమంటావు? అయినా, నీకు డబ్బుకిభయమేంగా? ముగ్గురు కొడుకులు ఉన్నారు నువ్వు అడగాలే కాని ముగ్గురూ నిన్ను డబ్బుతో ముంచెత్తరూ?" అని ఓ పొడి విసిరి, అతనికి యాత్రల మీద ధ్యాసమళ్ళించి అవతలకు జారుకున్నాడు. ఆయన పేరు జానకి రామయ్య. ఒక్కడే కొడుకు— అతను గవర్నమెంటు ఆఫీసులో ఉద్యోగి.



'శమైతాంగి'

జానకిరామయ్య యాత్రల గురించి చెప్పినప్పటి నుంచి అనంతరామయ్యకు తను కూడా యాత్రలకు వెళితే బాగుండు ననిపించ సాగింది. తను చాలా చిన్నపిల్లవాడుగా ఉన్నప్పుడు తన బంధువుల్లో ఒకరు కాశీ వెళ్ళివచ్చి ఘనంగా అన్నసంతర్పణచేశాడు పేదవారికి. ఆ విషయం ఎంతో గొప్పగా చెప్పుకునే వారు జనం. ఆ రోజుల్లో కాశీకి వెళ్ళిన వాళ్ళని కాటికి వెళ్ళినవారితో జమ చేసే వారట. ప్రయాణ వాహనాలు లేని రోజుల్లో జట్లుగా ఏర్పడి, నడుచుకుంటూ యాత్రలు చేసి రావడమంటే నిజంగా మనిషికి మరో జన్మ నెత్తినట్లే భావించే వారట, ఆ రోజుల్లో.

కాని, ఇప్పు డా భయాలు లేవు. డబ్బు ఉండాలే గాని, ఎంత దేశమైనా అలుపు లేకుండా తిరిగి రావచ్చు. అంతసుఖ సాధనాలున్నాయి ఇప్పటి మానవుని మనుగడకు.

తనకూ యాత్రలు చేయాలని ఎప్పుడైతే బుద్ధి పుట్టిందో, ముగ్గురు కొడుకులకూ ఉత్తరాలు వ్రాశారాయన— "తనకి దక్షిణ దేశ యాత్ర చేయాలని ఉందని, ఆ ఊరినుంచే ఓ బస్సు కొద్ది రోజుల్లో బైలుదేరబోతున్నదని, తనదా ఊరు పొమ్మంటున్నది, కాడు రమ్మంటున్నది అనే వయసు కాబట్టి, ఈ వయసులో మనిషికి ఇహలోక చింతకంటే పరలోక చింతన చాలా అవసరమని, తనిప్పుడు ఆ చింతనతోనే రోజులు గడపాలని నిశ్చయించుకున్నట్లు, తన ప్రయాణం గురించి చేయూతనిస్తూ సహకరిస్తే తనకెంతయినా ఆనందంగా

ఉంటుందని. ఏ సంగతీ తిరుగుటపాలో తెలియజేయలేదని, ఆ ఉత్తరాలు చూసుకునే ఏదీ నిర్ణయించుకుంటానని" అంటూ.

వాటి జవాబుల కోసమే ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నా రాయన తన కొడుకులకు ఉత్తరాలు రాసి అప్పుడే వారం రోజులైంది. కాని, వాళ్ళ దగ్గిరనుంచి సమాధానం మాత్రం ఇంత వరకూ రాలేదు. రోజూ వీరయ్య వచ్చే వేళకు వీధి గుమ్మంకాయడం, వీరయ్య 'మీకేమీ రాలేదు సార్' అన్నట్లు నిరాశగా సంజ్ఞ చేయడం. తన కేమీ లేవా? ఎందుకని రాలేదో? బహుశా వీరయ్యే ఇవ్వడానికి బద్ధకించి తనకివచ్చిన ఉత్తరాలను చెత్తబుట్టకి ఆహారంగా పెడుతున్నాడేమో? లేకపోతే, తమ తమ అభిప్రాయాలు చెప్పడానికి ఉత్తరాలెందుకు, స్వయంగా వెళ్ళి చెప్పితే సరి అనే ఆలోచనతో వాళ్ళే బైలుదేరి వస్తారేమో? ఈ రకమైన ఆలోచనలతో రోజుల్ని గడుపుతున్నారాయన.

ఆలోచనలతో పరధ్యానంగా ఉన్న ఆయన తుళ్ళిపడినట్లు చెవులు రిక్కించారు. ఆయన ఊహ తప్పు కాదు. ఎవరో వస్తున్న సూచనగా గేటు తెరిచినప్పుడు, చెప్పుల కాళ్ళతో నడిచి వస్తున్న ధ్వని వినిపించగానే ఆయన నిటారుగా లేచి కూర్చున్నారు. ఆయన ముఖం సంతోషంతో విప్పారింది. ఆ వచ్చేది తప్పకుండా పోస్టుమన్ వీరయ్యేను! ఉత్తరాలతో పాటు ముగ్గురు కొడుకుల దగ్గిరనుంచీ వచ్చిన మనియార్డర్లు కూడా అందించడానికి అతనే హుషారుగా వస్తున్నాడు. పాపం, వీరయ్యకు తనంటే చాలా ఇష్టం. ఎందు కిష్టం, ఉండదూ? నెలకు రెండు, మూడుసార్లన్నా డబ్బు ఇస్తుంటాడు కాఫీ త్రాగమని. ఇక ఏ కొడుకన్నా డబ్బు పంపిస్తే అది తీసుకుని మరో రూపాయి ఇస్తాడు "సినిమా చూడవోయ్" అంటూ. "ఓ తప్పకుండా వెళతాను, సార్" అని నోటినిండా నవ్వుతాడు వీరయ్య. ఈసారి ముగ్గురు కొడుకులూ డబ్బు పంపించి ఉంటారు కనక, కనీసం రెండు రూపాయలైనా ఇవ్వాలి. యాత్రల నుంచి వచ్చేటప్పుడు అతనికి పనికి వచ్చే వస్తువేదైనా తెచ్చి బహుమతిగా, లేదా తన గుర్తుగా ఉండేలా ఇవ్వాలి. అతని ఊహాలు అలా సాగుతున్నాయి. చెప్పుల శబ్దం గుమ్మంబైటే ఆగిపోయింది. "అయ్యగారూ!" చెప్పుల తాలూకు శాల్తీ పిలిచింది గుమ్మంబైటనుంచే. ఆ గొంతు మాత్రం వీరయ్యది కాదని అనంత రామయ్యకి తెలిసిపోయింది. ఆయన ఉత్సాహమంతా నీరైపోయింది. ఎవరూ? విసుక్కుంటూ ఇవతలకు వచ్చాడాయన. "అయ్యగారూ, బాగున్నారా?" ఆ వ్యక్తి చేతులు జోడిస్తూ వినయంగా అన్నాడు.

"వెంకయ్యా, నువ్వా? ఎప్పుడు వచ్చావు ఊరునుంచి? నీ కొడుకు, కోడలు బాగున్నారా? ఉంటావా నాలుగు రోజులు? రా, ఇలా కూర్చో." వచ్చిన వ్యక్తిని ఆప్యాయంగా పలకరించి ఆహ్వానించారు. వెంకయ్య లోగడ వాళ్ళ ఇంటి నౌఖరుగా పని చేశాడు. అతనికి ఒక్కడే కొడుకు; కూతుళ్ళు మాత్రం ముగ్గురు. తొలిసారిగా కూతురు పుట్టిందని తెలిసి ఆ కోపంతో పెళ్ళానిదే తప్పన్నట్లు కొన్ని రోజుల వరకూ పెళ్ళాం ముఖం చూశాడు కాదు. "ఆడపిల్ల కావాలని అదేమైనా కోరి కన్నదేమిరా? ఏ పిల్ల అయినా, పిల్లడయినా భగవత్ప్రసాదం అనుకోవాలి" అని తెలిసిన వాళ్ళూ, వీళ్ళూ, అనంత రామయ్య లాంటి పెద్ద మనుష్యులూ చెప్పగా, చెప్పగా రాజీకొచ్చి భార్యతో మాట్లాడటం మొదలుపెట్టాడు. రెండో సారికూడా ఆడపిల్లే పుట్టింది. ఈ సారి రెండు, మూడు నెలల వరకూ భార్యతో మాట్లాడలేదు. పెళ్ళాం చేతి భోజనం తినలేదు. తరవాత తనంత తానే భార్యకు దగ్గిర అయ్యాడు. మూడో సారి మళ్ళీ కడుపుతో ఉంది అతని భార్య. "ఈ సారీ ఆడపిల్లని కన్నావంటే ఇక నీకూ, నాకూ అంతే" అని ఖచ్చితంగా చెప్పాడు వెంకయ్య. కళ్ళనీళ్ళతో దేవుడిని ఓ కొడుకుని ఇమ్మని బ్రతిమాలుతూ పురుటికి బయలుదేరింది భార్య.

ఈ సారి ఆవిడ అదృష్టం బాగుండి మగ పిల్లాడే పుట్టాడు. ఆ కబురు విన్న వెంకయ్య ఎగిరి గంతేశాడు వంశోద్ధారకుడు పుట్టాడూ అంటూ.

ఆ కొడుక్కి బాగానే వేడుకలు జరిపించాడు.

"వాడు నాలా నౌకరు పని చేయకూడదు, అయ్యగారూ. వాడిని బాగా చదివిస్తాను. కలకటేరు అవుతాడు నా బాబు" అని అనంతరామయ్య దగ్గిర చెప్పి మురిసిపోయే వాడు. రోజులో కొన్ని గంటలు ఆ కొడుకు చేసే అల్లరి, ఆగడాలు, ఆట పాటలు వర్ణించడంతోనే సరిపోయేది అతనికి. ఓ సారి ఆ కుర్రాడికి చాలా జబ్బు చేసింది. ఇక బ్రతకడేమో అని నిరాశ చేసుకున్నారంతా. ఇక వెంకయ్యఅయితేతిండికి,నిద్రకుదూరమై అల్లాడి పోయాడు. అతను దాచుకున్న డబ్బంతా వంశోద్ధారకుడినిరక్షించుకోవడం కోసమే ఖర్చయి పోయింది. డబ్బు పోతే పోయింది, బిడ్డ బ్రతికాడు కదా అని ఎంతయినా పొంగి పోయాడు. ఎన్నో కష్టాలు భరించి, ఒక్కగా నొక్క కొడుకుని పెంచి పెద్ద చేశాడు వెంకయ్య. అతను కోరుకున్నట్లే కొడుకుని గ్రాడ్యుయేట్ చేశాడు. బి. ఎ. పట్టా పొందిన ఆ కొడుకు కలెక్టర్ కాలేదు కాని, కలెక్టర్ ఆఫీసులో క్లర్క్‌గా పని చేస్తున్నాడు. చదువుకుని ప్రయోజకుడైన కొడుక్కి ఈ మధ్యే పెళ్ళికూడా చేశాడు వెంకయ్య.

"నీ కొడుకు ఉద్యోగం చేస్తుండగా నువ్వింకా అక్కడా, ఇక్కడా పనులు చేయడం దేనికి? నీ కొడుకు దగ్గిరికి వెళ్ళి ఉండరాదూ హాయిగా" అని అందరూ తలో మాటా అనేసరికి, నౌకరు పనికి గుడ్‌బై కొట్టి కొడుకు దగ్గిరికి వెళ్ళి పోయాడు వెంకయ్య. అప్పటికే ఇద్దరు ఎదిగిన కూతుళ్ళ పెళ్ళి చేయడం, పురుగు ముట్టుకుని భార్య కన్ను మూయడం జరిగిపోయాయి. ఒంటరిగా ఉండలేక, వాళ్ళా వీళ్ళా మాటలు తల కెక్కి, 'అవును! నా కేం లోటు? సంపాదించే కొడుకు ఉండగా ఇంకా ఎందుకు కష్టపడాలి?' అనుకుంటూ చేసే పనులకు ఉద్వాసన చెప్పి కొడుకు దగ్గిరికి వెళ్ళిపోయాడు. ఈ సంగతి అతనితో పరిచయమున్న అందరికీ తెలుసు. 'వెంకయ్యకు ఇక మంచైనా సుఖపడే యోగం వచ్చిందిలే, పాపం' అనో, 'కష్టపడ్డ ప్రాణం ఊరికే కూర్చోలేదు. అక్కడయినా ఏదో పని చేస్తూనే ఉంటాడు' అనో అనుకున్నారు.

అంత హుషారుగా వెళ్ళిన వెంకయ్య పదిహేను రోజులు గడవకుండానే మొహం వేలాడేసుకుని,ఉసూరుమంటూ రావడంతో అందరి మాటా ఎలా ఉన్నా, అనంత రామయ్య మాత్రం చాలా ఆశ్చర్య పడ్డారు. ఆ ఆశ్చర్యాన్ని అణుచుకోలేక అలా అడిగేశారు:

"ఇంక ఎప్పటికీ ఇక్కడే ఉండిపోతా నయ్యగారూ." అన్ని మాటలకూ సమాధానంగా ఒక్క మాటలోనే పొందుపరుస్తూ చెప్పా డతను.

"అదేం, మీ కొడుకు వెళ్ళిపొమ్మన్నాడా? లేక..." మాట పూర్తి కాకుండానే ద్వంద్వార్థంగా ఊరుకున్నారు అనంతరామయ్య.

"అదేం నోరు తెరిచి పొమ్మన లేదు, అయ్యగారూ. కాని, భార్యా దాసుడిలా బ్రతుకుతున్న వాడి ధోరణి నచ్చలేదు నాకు. వంద రూకలు తెచ్చి భార్య చేతిలో పోస్తాడు. వాడు తాగే కాఫీ ఖర్చుకికూడా ఆవిడ చేతినుంచే రావాలా! అటువంటి సన్నాసి నా కేం కూడు పెడతాడు, అయ్యగారూ?ఓ సారి ఒంట్లో బాగోక పడుకున్నాను. పిల్లాడు ఆఫీసు నుంచి వచ్చాడు. 'నాన్నకు ఒంట్లో బాగాలేదు. కాస్త బార్లీ జావ కాచి ఇయ్యి' అన్నాడు. అంతే. 'కట్టుకున్నందుకు నీకు చేస్తాను కాని, నీ బాబుక్కూడా చేస్తానా చాకిరీ? కావలిస్తే



ఆంధ్ర కళాసమితి - తారానగర్ వారు ఇటీవల శ్రీ కృష్ణసత్య నాటకాన్ని ప్రదర్శించారు. ఇందులో కృష్ణుడుగా డి. ఎస్. మూర్తి, నారదుడుగా పీసపాటి నరసింహమూర్తి, సత్యభామగా సీతాకుమారి, నళినీ - వసంతకులుగా అంజలీదేవి - కె. ఎస్. ఆచార్యులు, రుక్మిణిగా సూర్య రత్నకుమారి, పురోహితుడు - యాదవులుగా టి వి ఎస్. స్వామి - కృష్ణారావు నటించారు. నిర్వహణ డి. ఎస్. రావు, ఎమ్. అప్పారావు, బి. ఎస్. రావు. దర్శకత్వం - డి. ఎస్. మూర్తి.

నువ్వే చేసుకో' అంది టక్కున. ఎందుకు వచ్చాను ఇక్కడికి, దేవుడా అని తెగ బాధ పడిపోయాను. 'పడుచోళ్లం మనం, ముద్దిన ఆమనలాయ నె డుకు పొనకంలో వుడకలా?' అనేది నేను నివేలా. అటు వంటి సంఘటనలు రెండు, మూడు చూశాక మరక్కడ నిలవలేక పోయూ నయ్యగారూ. మీ రంతా పల్లెగా ఉంటే నా కే లోటూ ఉండదు." చెప్పడం ఆపి గాఢంగా నిట్టూర్చాడు వెంకయ్య.

"అంతేనోయ్. ఈ సంగ పిల్ల లున్నారు మూశావూ..." అంటూ మాట పూర్తి చేసేలోగానే బయట నుంచి 'పోస్ట్' అన్న కేక వినిపించింది. అనంతరామయ్య ఉత్సాహంగా లేచారు. "ఉత్తరాలు వచ్చిన ట్లున్నాయి. ఉండు! వస్తాను" అంటూ నరుగూ, నడకా కాని వేగంతో వెళ్ళా రాయన వీధిలోకి.

"ఒకే సారిగా మూడు లెటర్స్ వచ్చాయి, సార్." ముసి ముసి నవ్వులతో మూడు కవర్లను తీసి అనంతరామయ్య గారి చేతిలో పెట్టాడు పోస్ట్‌మన్ వీరయ్య.

ఆ కవర్ల వైపు మార్చి మార్చి చూస్తూ—"ఇంకేమీ రాలేదా, వీరయ్యా? డబ్బా గట్రా వస్తుం దనుకున్నానే" అన్నారు అనంతరామయ్య, సగం ఉత్సాహం నీరుకారిపోగా.

"వస్తే ఇవ్వనా, సార్. మీరే ఓ పావలా ఉంటే ఇయ్యాలి. ఈ వేళ సిగరెట్టుకైనా డబ్బు ల్లేవు." వీరయ్య గుంభనంగా నవ్వాడు.

వీరయ్య పావలా అడిగితే అర్థ రూపాయి తెచ్చి ఇచ్చి లోపలకు వచ్చారు అనంతరామయ్య.

"ఎక్కడ నుంచి, అయ్యగారూ? అబ్బాయిలేనా రాస్తా? మీ కేం, అయ్య గారూ, ముగ్గురు కొడుకు లున్నారు. ఒకరు కాకపోతే ఒకరన్నా ప్రేమగా, అభిమానంగా చూస్తారు. కాని, ఒక్క కొడుకున్న తండ్రి గతి చూశారా— పగ వాడికైనా వద్దు, బాబూ, అటువంటి రాత." వెంకయ్య శూన్యంలోకి చూస్తూ రెండు చేతులూ జోడించాడు.

'అబ్బాయిలు ఏమని రాశారో తన ప్రయాణం గురించి? డబ్బు పంపిస్తా మనో, తెచ్చి ఇస్తామనో రాసి ఉంటారు. అంత ఆదాట్టుగా వాళ్ళ దగ్గిర మాత్రం డబ్బు ఉండద్దూ పంపడానికి? ఎవర్నయినా అడిగో, లేదా బాంకులో దాచినది డ్రా చేసో పంపాలి కదా?' దిగులు ఆవరించు కున్న మనసుకి ఓదార్పు మాటలు చెప్పు కుంటూ ఒక దాని తరవాత ఒకటిగా మూడు కవర్లూ తెరిచి చదివా రాయన. పెద్ద కొడుకు రాశాడు. తను చాలా ఇబ్బందుల్లో ఉన్నానని, పేరుకి నాలు గంకెల జీతమే కాని, పిల్లల చదువుకు, తిండికి, హోదా మెయిన్‌టెయిన్ చేయ డానికి చాలడం లేదని రాసి, "ప్రతి నెలా ఎంతో కొంత అప్పు చేయక తప్పడం లేదు. చేసిన అప్పు తీర్చడం, తిరిగి కొత్త అప్పు తీయడం, ఇలా ఉంది నా పని. ఇలా రాసినందుకు ఏమీ అనుకోకండి. అయినా, అంత పెద్ద వయసులో మీ రేం ప్రయాణం చేయగలరు అవస్థ పడ టానికి తప్పించి? వీలుగా ఉంటే పంటలు చేతికి రాగానే కొంత ధాన్యం అమ్మి డబ్బు పంపించవలెను" అంటూ ముగించాడు.

ఆ ఉత్తరం చదివి లోటపోతే ఉడికి పోయారు అనంతరామయ్య. 'వాడికి వచ్చేది వేయి రూపాయలు. వాడికి, వాడి పెళ్ళాం, ఇద్దరు పిల్లలకూ చాలడం లేదట! పైగా పంటలు రాగానే ధాన్యం అమ్మి డబ్బు పంపించాలట! పంపను. రాగి పైసా పంపను. ఏం—ఎందుకు పంపాలి? ఆ డబ్బుతో హాయిగా తీర్థ క్షేత్రాలు తిరిగి వస్తాను!" కసిగా లోపల గొణు క్కున్నారు.

రెండో కొడుకు రాశాడు. తన భార్య కీమధ్య చాలా సుస్తీ చేసిందని, అప్పుడు మారువాడీ దగ్గిర ఎక్కువ వడ్డీకి అప్పు చేయవలసి వచ్చిందని, నెల నెలా ఆ బాకీలో కొంత, వడ్డీ కొంత జమ చేయా లని, కనక ఉన్న డబ్బు తనకే సరిగా సరిపోవడం లేదని, పంపనందుకు ఏమీ అనుకోవద్దని, తన భార్యకు గాలి మార్పు కావాలని డాక్టర్లు చెప్పారని, కనక త్వరలో అక్కడకు భార్యా పిల్లలతో వస్తున్నట్లు, పల్లెటూరిగాలి ఆమె కెంతో మంచిదనిపిస్తున్నట్లు, ప్రాశాడు. "మేము వచ్చేసరికి మీరు, వెళ్ళిపోతే ఎలా? ఊళ్ళు ఎప్పుడన్నా చూడ వచ్చులే, నాన్నా! మేము వచ్చేసరికి ఇల్లు అదీ బాగు చేయించి, లోపల బాత్‌రూమ్, లావెటరీ వగైరాలుకూడా కట్టించి సిద్ధం చేయి. ఈ మూడు నెలలూ సెలవు పెట్టి అక్కడే ఉంటాను. మీ కోడలు బాత్‌రూమ్‌లో తప్ప విడిగా స్నానం చేయదు. అలాగే లావెటరీ కూడాను" అంటూ ముగించాడు. 'అసలు వీడికి డబ్బు పంపించమని రాయడం నాదే బుద్ధి పొరపాటు. తండ్రి అక్కడ ఒంటరిగా ఏం బాధలు పడుతున్నాడో అనే బాధ కాని, దిగులు కాని లేదు సరికదా, ఆ బస్తీ దొరసాని కిక్కడ ఏర్పాట్లు చేయాలట, ఏర్పాట్లు!' కోపంతో ఆయన కళ్ళు ఎరుపెక్కాయి. ఆయన ముఖంలో ప్రస్ఫుట మయ్యే కోపం, ఉద్రేకం పసికట్టిన వెంకయ్య ఆ ఉత్తరాల్లో ఏం ఉందో అనుకున్నాడు.

ఇక మూడో ఉత్తరం ఆఖరి వాడు రాశాడు చాలా క్లుప్తంగా. త నీ మధ్య సినిమాల్లో నటించే ధాన్సు క పం ప్రయత్నిస్తున్నానని ప్రాశాడు. "అదే కాని ఫలిస్తే ఆ పైన మనకి కావలసి నంత డబ్బు! అప్పుడు మీకు ఇండియా ఒక్కటే కాదు, విదేశాలు కూడా చూపిస్తాను. ఎలా అనుకున్నారు? బోడి రైల్లో ఎక్కించి తిప్పుతా ననుకున్నారా? ఉహూఁ ప్లేన్ బుక్ చేసి మరీ చూపిస్తాను— తెలిసిందా? ప్రస్తుతం నా దగ్గిర డబ్బు లేదు. ఉన్న డబ్బు కాకామరు లను మేపడానికే చాలడం లేదు. కనక ఇలా రాశానని అన్యథా భావించ వద్దు. వీలుగా ఉంటే, మీ దగ్గిర డబ్బు ఉంటే, కొద్దిగా పంపండి, చాలు! అదిగో, ఎవరో వచ్చారు. బహుశా ఏ ప్రొడ్యూసరో అయి ఉంటాడు. మరి ఉంటాను. టా. . .టా" అంటూ ముగించాడు.

'ఈ ఉత్తరంకూడా వాడి సినిమా స్క్రీన్ లానే ఉంది. ఛీ! ఛీ! కొడుకులో, కొడుకులో అని ఆక్రోశిస్తాము. కొడుకు లేకపోతే పుట్టగతులే ఉండవని భయపడతాము. కాని, కొడుకులు పుట్టినా ఎంతమంది తండ్రులను ప్రేమగా, అభిమానంగా, జన్మకు కారకుడైన తండ్రి అంటూ ఆప్యాయంగా చూసుకుంటున్నారు? అద్దాల నాడే కాని, గొద్దా లొచ్చాక మన పిల్లలు కారు. మరి అమ్మాయిల మొగుళ్ళు నా లాంటి తండ్రులకు పరాయి వాళ్ళు. చుట్టం చూపుగా వచ్చి వెళ్ళే అతిథులు. అంతే!' కళ్ళ నుంచి వెచ్చటి కన్నీరు కారుతూ ఉండగా విషాదంగా నవ్వుకున్నా రాయన.

ఆయన్ని ఆ స్థితిలో చూస్తున్న వెంకయ్యకు పలకరించడానికి మనసు రాక నెమ్మదిగా లేచాడు, 'అయ్యగారి మన సిప్పుడు బాగా లేదు' అనుకుంటూ. "మీ ప్రయాణం ఎంత వరకు అయిం దోయ్? అప్పుడే నా ప్రయాణపు ఏర్పాట్లు సాగిపోతున్నవి. దారిలో తినడానికి మా కోడలు మెత్తని రవ్వలడ్డూలు, తొక్కుడు లడ్డూలు చేస్తున్నదోయ్" అని చెప్పాలని ఉరుకులతో వచ్చిన జానకిరామయ్య, చేతిలో ఉత్తరాలతో ఎక్కడో శూన్యంలోకి చూస్తున్నట్లు మౌనముని స్థాణువులా ఉండిపోయిన అనంతరామయ్యను చూసి చెప్పాలనుకున్న మాటను గుండెలోనే గుటక వేసి, నెమ్మదిగా బయటికి వెళ్ళిపోయాడు.

కాని అతని కెలా తెలుస్తుంది అనంత రామయ్య ఆవేదన, ఆయన కొడుకులు ఆయన కిచ్చిన ప్రతిఫలం సంగతేను? *

